పాఠశాలలు మూసేస్తే ఉద్యమమే

1,864 స్కూళ్ల మూతకు సర్కారు కుట్ర • 8 నెలల్లోనే విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

రాష్ట్రంలో ఖాళీగా 25 వేల టీచర్ పోస్టులు • విద్యావ్యవస్థపై సోయిలేని ప్రభుత్వం: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాల విద్యను తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థపై సోయిలేని సీఎం విద్యార్థులు లేరన్న కారణంతో ఈ విద్యా సంవత్సరంలో దాదాపు 1,864 స్కూళ్లను మూసేసే ప్రయత్నం చేస్తున్నారన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. 2024లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య అంతకుముందు ఏడాదితో పోల్చుకుంటే దాదాపు 2.4 లక్షలు తగ్గిందని, ఇది రాష్ట్ర విద్యారంగానికి ప్రమాద సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. 8 నెలల కాలంలోనే ప్రభుత్వ విద్యను కాంగ్రెస్ సర్కార్ అస్తవ్యస్తం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెంటనే వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు లేరంటూ స్కూళ్లను మూసివేయడం, టీచర్లను డిప్యుటేషన్‌పై ఇతర స్కూళ్లకు పంపడంతో చాలాచోట్ల విద్యార్థులకు ప్రభుత్వ విద్య దొరకని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

స్కూళ్ల మూసివేత సమాజానికి మంచిది కాదు

గురుకుల స్కూళ్లలో జరుగుతున్న సంఘటనలు, వసతి గృహాల్లో విషాహారం, భద్రతలేని పరిస్థితులు, విద్యార్థులు లేరంటూ స్కూళ్లను మూసివేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. స్కూళ్లను మూసివేయటం తెలంగాణ సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదని పేర్కొన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్కూళ్లలో డ్రాపౌట్స్‌ను నివారించేందుకు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా తెచ్చామని, తద్వారా గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం పోటీపడే పరిస్థితి వచ్చిందని ఆయన వివరించారు. విద్యా వ్యవస్థలో ఏం జరుగుతుందో ముఖ్యమంత్రికి తెలుసా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేరని, సీఎంకు విద్యా వ్యవస్థపై పట్టింపు లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రాజకీయాలు, డైవర్షన్ టాక్టిక్స్ తప్ప ప్రజల సమస్యలపై సోయి ఉందా ? అని నిప్పులు చెరిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలు, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేసేందుకు విద్యావేత్తలు, మంత్రులతో కూడిన కమిటీ వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

విద్యార్థులకంటే జూపార్క్ ముఖ్యమా?: కేటీఆర్

తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఓవైపు గురుకుల విద్యార్థినులు వీధుల్లో పోరాటం చేస్తుంటే, మరోవైపు హైదరాబాద్‌లో ఇంకో జూపార్క్ నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని, సీఎంకు విద్యార్థుల కంటే జూ పార్క్ నిర్మాణమే ఎక్కువా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా ఎందుకు శిక్షిస్తున్నారని శనివారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎంను కోరారు. విధ్వంసకర రాజకీయాలను మాని ఉజ్వల భవిష్యత్తును నిర్మించే అంశాలపై దృష్టిసారించాలని సూచించారు. పాలమాకుల స్కూల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకొని వారికి అండగా నిలిచిన మాజీమంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

పురుగుల అన్నం.. ప్రశ్నిస్తే వాతలా?

- ఆడపిల్లల వేదన సీఎంకు పట్టదా?
- తక్కువ జాతి అంటూ కులదూషణలా?
- పిల్లలను కొట్టే హక్కు మీకెక్కడిది?
- విద్యార్థులు రోడ్డెక్కి ధర్నా చేసినా సీఎం స్పందించకపోవటం బాధాకరం
- విద్యాశాఖమంత్రిగా విఫలం: హరీశ్‌రావు
- పాలమాకుల కస్తూర్బా కాలేజీ సందర్శన
- బాధలు చెప్పి కన్నీరుమున్నీరైన విద్యార్థులు

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకులలోని కస్తూర్బాగాంధీ హాస్టల్‌లో హరీశ్‌రావుకు గాయాలు చూపుతున్న విద్యార్థులు. చిత్రంలో మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి

శంషాబాద్ రూరల్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): 'పురుగుల అన్నం పెడుతున్నారని ప్రశ్నించినందుకు విద్యార్థులను ఇష్టమొచ్చినట్టు కొడతారా? తక్కువ జాతి అంటూ కులదూషణలు చేస్తారా? ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తే సీఎం ఏం చేస్తున్నారు? ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం తప్ప పాలన మీద దృష్టిలేకపోవడం విడ్డూరంగా ఉన్నది' అని సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకులలోని కస్తూర్బాగాంధీ గిరిజన హాస్టల్‌ను మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డితో ఆయన కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలంతా ఒక్కసారిగా హరీశ్ వద్దకు వచ్చి తమ సమస్యలన్నింటినీ ఏకరువు పెట్టారు. ఇన్ని రోజులుగా పడుతున్న యాతనను పూసగుచ్చినట్టు వివరించారు. పురుగుల అన్నం పెడుతున్నారని ప్రశ్నించినందుకు ఉపాధ్యాయులు వాతలొచ్చేలా కొడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారి బాధను వింటూ హరీశ్‌రావు సైతం కంటతడి పెట్టారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలీక కిలోమీటర్ దూరం పరుగెత్తి రోడ్డెక్కి ధర్నా చేసే పరిస్థితి వచ్చిందంటే లోపం ఎక్కడున్నదో అర్థం అవుతున్నదని తెలిపారు. నాణ్యమైన భోజనం, తాగునీరు, సరైన దుస్తులు లేవని ఆవేదన చెందుతుండటం బాధాకరమని అన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు వాతలొచ్చేలా కొడుతున్నారని, కులంపేరుతో దూషిస్తున్నారని చెప్తూ విద్యార్థులు ఏడుస్తున్నారని వెల్లడించారు. ఒక విద్యార్థి టీచర్ కొట్టిన దెబ్బలకు గాయమైన చేతిని చూపుతూ ఏడుస్తున్న తీరు తనను ఎంతగానో కలచివేసిందని చెప్పారు. 'ఇప్పటివరకు ఒక జత బట్టలే ఇచ్చారు. మరో జత అడిగితే ఇవ్వటం లేదు. పుస్తకాలు సైతం ఇవ్వటం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలు, కస్తూర్బాగాంధీ హాస్టల్స్ పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. కేసీఆర్ పాలనలో సన్నబియ్యంతో అన్నం పెడితే ఈ సర్కారు గొడ్డుకారం పెడుతున్నది. ఇప్పటివరకు గురుకులాల్లో 500 మంది దవాఖాన పాలయ్యారు. 38 మంది పిల్లలు చనిపోయారు. పాములు కరిచి చనిపోతున్నారు. ఎలుకలు కొరికి దవాఖానల్లో చేరుతున్నారు. ఒకప్పుడు గురుకులాల్లో చదవటం ఒక కల.. ఇప్పుడు ఆవేదనగా మారింది' అని తెలిపారు.

గురుకులాలను గాలికి వదిలేశారు

'సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖమంత్రిగా ఉన్నారు. ఆయన విద్యాశాఖ నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారు. మైనార్టీ గురుకులాలకు జనవరి నుంచి మెస్ బిల్లులు ఇవ్వలేదు. రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో కాస్మెటిక్ చార్జీలు, కరెంట్ బిల్లులు ఇవ్వకపోవటం ఏమిటి?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సీఎం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ సీఎం గురుకులాలను గాలికి వదిలేశారని ఆరోపించారు. పిల్లలు భయపడుతున్నారని, ఉపాధ్యాయులను మార్చి కొత్తవారిని తీసుకురావాలని సూచించారు. ఆడపిల్లల రోదన మంచిది కాదని, వారి బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ధర్నాకు దిగారని వెల్లడించారు.

“

'పురుగుల అన్నం తింటున్నాం. కలుషిత నీళ్లు తాగుతున్నాం. ఇదేంటని అడిగితే అమ్మాయిలం అని కూడా చూడకుండా వాతలొచ్చేలా కొడుతున్నారు. ఇదిగో చూడండి నా చేతిపై వాత. మాకిక్కడ చాలా భయంగా ఉన్నది. మా తల్లిదండ్రులను కలవనిస్తలేరు. వారిని లోనికి అనుమతిస్తలేరు. మీలాంటి తక్కువ జాతి వాళ్లకు ఇదే ఎక్కువ అంటూ కులదూషణ చేస్తున్నారు. చదువు కూడా సక్కగా జెప్పట్లేదు. గైడ్స్ చూస్కొని రాస్కొండంటుండ్రు. మేము ఇక్కడ ఉండలేం. దయచేసి మమ్మల్ని ఆదుకోండి'

- హరీశ్‌రావుతో పాలమాకుల కస్తూర్బా కాలేజీ విద్యార్థులు

మేమున్నాం.. మీ పిల్లలకేం కాదు

'మేము ఉన్నం.. మీ పిల్లలకు ఏమీ కాదు. భయపడొద్దు' అని పాలమాకుల కస్తూర్బాగాంధీ హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులకు హరీశ్‌రావు భరోసానిచ్చారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులున్నా తనకు సమాచారమివ్వాలని ఫోన్ నంబర్ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. హాస్టల్‌ను సందర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్, దిద్యాల శ్రీనివాస్, మంచర్ల మోహన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

లోకం పోకడ

మేం చెరువుల్లో ఇండ్లు కట్టుకోవడం కాదు సార్.. వర్షానికి!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	34.2°c	24.1°c
రంగారెడ్డి	32.4°c	20.2°c
నిజామాబాద్	30.6°c	24.1°c
మెదక్	30.4°c	22.0°c
కరీంనగర్	29.0°c	24.0°c
వరంగల్	28.0°c	24.0°c
ఖమ్మం	28.0°c	24.0°c
నల్లగొండ	26.0°c	22.0°c
హైదరాబాద్	24.6°c	22.3°c
మహబూబ్‌నగర్	23.3°c	21.5°c

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

బాన్సువాడ, ఆగస్టు 31: అనారోగ్యం బారిన పడి గురుకుల విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన శనివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం మైనారిటీ గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. జుక్కల్ మండలం పడంపల్లికి చెందిన అంజలి (12) ఏడో తరగతి చదువుతున్నది. ఇటీవల ఇంటికి వెళ్లిన బాలిక.. గత నెల 27న పాఠశాలకు వచ్చింది. గురువారం జ్వరంతోపాటు వాంతులు చేసుకున్నది. శుక్రవారం మరోసారి వాంతులు చేసుకోగా టీచర్లు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. శుక్రవారం రాత్రి నిజామాబాద్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ అంజలి మృతి చెందింది. ఘటనపై బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి విచారణ చేపట్టారు.

గురుకులాలను కనుమరుగుచేసే కుట్ర

విద్యార్థులు ధర్నాలు చేస్తున్నా పట్టదా? • సీఎం రేవంత్ స్పందించాలి : కొప్పుల

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో గురుకుల పాఠశాల వ్యవస్థనే కనుమరుగు చేయాలనే కుట్రకు పాల్పడుతున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గురుకులాల్లో 36 మంది చనిపోయారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలుగానే భావించాల్సి ఉంటుందని చెప్పారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌తో కలిసి ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే గురుకుల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, పేదపిల్లలు చనిపోతే సర్కార్‌కు పట్టింపే లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కలుషిత ఆహారం తిని వెయ్యిమందికి పైగా అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. పెద్దాపూర్‌లో ఆరుగురు విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఇద్దరు చనిపోయారని, ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లిలో విద్యార్థి విద్యుత్తు షాక్‌తో చనిపోయాడని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా పాలమాకులలో పిల్లలు కారం తిండి తినలేక రోడ్డెక్కారని, దీనిపై వెంటనే సీఎం స్పందించాలని, గురుకులాలపై సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్ల క్రితం కాంగ్రెస్ హయాంలో గురుకులాల్లో అడ్మిషన్లకు ఎవరూ ముందుకు రాలేదని, కేసీఆర్ హయాంలో గురుకులాలను గొప్పగా తీర్చిదిద్దారని, దాంతో సీట్ల కోసం పోటీ పడుతున్నారని చెప్పారు. తెలంగాణలో 1,022 గురుకులాలు ఉన్నాయని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేస్తున్నదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి బడాయి మాటలు చెప్పుడు తప్ప చేతలు లేవని ఎద్దేవాచేశారు. గురుకులాలను ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? చెప్పాలని, దీనిపై సీఎం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చదువుకోవాలంటే.. ఇలా ప్రయాణించాల్సిందే!

పాఠశాలకు వెళ్లి చదువుకోవాలంటే విద్యార్థులు ప్రాణాలకు తెగించాల్సిందే! జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలంలో ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. పచ్చర్లకు చెందిన విద్యార్థులు మాన్‌దొడ్డి పాఠశాలకు నిత్యం ఐదు కిలోమీటర్లు కాలినడకన వెళ్తున్నారు. మాన్‌దొడ్డి గ్రామంలోని ఇంటర్ విద్యార్థులు అయిజలో విద్యనభ్యసిస్తున్నారు. నిత్యం ఆటోల్లో కిక్కిరిసి.. టాప్‌లపై కూర్చొని ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వం తమ గ్రామాలకు బస్సులు నడపడం లేదని, దారిలో ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను వాపోతున్నారు.

–రాజోళి

బ్యాంకు వద్దే రైతుల నిద్ర

రుణమాఫీ రెన్యువల్ కోసం తండ్లాట

తొగుట ఏపీజీవీబీ వద్ద అన్నదాతల దైన్యస్థితి

తొగుట, ఆగస్టు 31 : రుణమాఫీ ఏమో కానీ రెన్యువల్ చేసుకోవడానికి రైతులు అవస్థ పడుతున్నారు. రోజూ బ్యాంకు వద్దకు వెళ్లి నిరీక్షించినా తమవంతు వస్తలేదని టోకెన్ల కోసం రాత్రిపూట బ్యాంకు వద్దే నిద్రిస్తున్నారు. ఈ విచిత్ర పరిస్థితి సిద్దిపేట జిల్లా తొగుట మండల కేంద్రంలోని ఏపీజీవీబీ వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నది. తొగుట మండల కేంద్రంలోని ఏపీజీవీబీలో రుణాల రెన్యువల్‌కు వారానికి ఒక గ్రామం చొప్పున బ్యాంకు సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ఈ బ్యాంకులో ఒకరే ఫీల్డ్ ఆఫీసర్ ఉండటంతో మేనేజర్ సహకరిస్తున్నా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి రావడం, సర్వర్ సమస్యలతో రోజుకు 25 నుంచి 30 మందికి మాత్రమే రెన్యువల్ అవుతున్నాయి. బ్యాంకు చుట్టూ తిరిగినా తమ నంబర్ రాకపోవడంతో విసిగి వేసారిన రైతులు విధిలేక రాత్రిళ్లు బ్యాంకు వద్దకు వచ్చి లైన్ కడుతున్నారు. బ్యాంకు పాస్‌బుక్, ఆధార్, 1బీ సర్టిఫికెట్లతో క్యూలో పెడుతున్నారు. లైన్ వెనుకా ముందు అవుతుందనే భయంతో నిద్రాహారాలు మాని అక్కడే నిరీక్షిస్తున్నారు. మహిళలు సైతం ఇబ్బందులు పడుతూ బ్యాంకు వద్ద రాత్రిళ్లు నిద్రిస్తున్నారు. ఉదయం బ్యాంకు అధికారులు వచ్చే వరకు అక్కడే ఉండి వారి ద్వారా టోకెన్ తీసుకుంటున్నారు. ఎంతమంది రైతులున్నా 30 మందికే టోకెన్లు ఇస్తూ, మిగతా వారికి వేరే తేదీ కేటాయిస్తున్నారు. రుణమాఫీ ఏమిటో కానీ బ్యాంకుల చుట్టూ తిరిగి వేసారిపోతున్నామని అన్నదాతలు వాపోతున్నారు. కాంగ్రెస్ పాలనలో తమకెప్పుడూ కష్టాలు.. కన్నీళ్లేనని ఆవేదన చెందుతున్నారు. గతంలోనూ రాత్రి కరెంట్ కోసం పొలానికి వెళ్లి నీరు పారించుకునేవారమని, కరెంట్ ఎప్పుడొస్తదా అని అక్కడే ఉండి నిరీక్షించేవారమని పేర్కొంటున్నారు.

బయ్యారంలో 34% మందికే రుణమాఫీ

బయ్యారం, ఆగస్టు 31: మహబూబాబాద్ జిల్లా బయ్యారం సహకార పరపతి సంఘంలో మూడు విడతల్లో కేవలం 34 శాతం మంది రైతులకే రుణమాఫీ జరిగింది. సొసైటీ పరిధిలో మొత్తం 2,845 మంది 8,90,25,482 రుణాలు పొందగా, అందులో తొలి విడతలో 436 మందికి రూ.1,22,22,115, రెండో విడతలో 342 మందికి రూ.76,21,560, మూడో విడతలో 203 మందికి రూ.6,95,59,65 రుణాలు మాఫీ అయ్యాయి. మొత్తంగా మూడు విడతల్లో కేవలం 34 శాతం మందికే రుణమాఫీ వర్తించింది. అదేవిధంగా బయ్యారం ఏపీజీవీ బ్యాంకులో 1,403 మంది రుణాలు పొందగా 368 మందికి, ఎస్‌బీఐలో 720 మందికిగాను 287మందికి, యూనియన్ బ్యాంకులో 3,020 మందికి గాను 1,070 మందికి, గంధంపల్లి ఎస్‌బీఐలో 3,040 మంది రుణాలు తీసుకోగా 682 మందికి మాత్రమే రుణాలు మాఫీ అయ్యాయి. సాంకేతిక కారణాలతో కొందరు, ఆధార్, బ్యాంకు పేర్లు తప్పుగా ఉండటంతో మరి కొందరు, కుటుంబంలో రూ.2 లక్షలకు మించి రుణం పొందిన వాళ్లు ఉండటం వంటి పలు కారణాలతో చాలామందికి రుణాలు మాఫీ కాలేదు. దీంతో రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ మాఫీ కోసం అవస్థలు పడుతున్నారు.

రేవంత్‌తో ఢిల్లీ కటీఫ్

▸ మొదటిపేజీ తరువాయి...

పాటగా సాగిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కనీసం అపాయింట్‌మెంట్ కూడా దొరకని పరిస్థితి నెలకొన్నదని అంటున్నారు. ఏవేవో ప్రయత్నాలు చేసి అపాయింట్ తీసుకున్నా.. ఎక్కువ సమయం కూడా ఇవ్వడం లేదని సమాచారం. గతవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కలిసి ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీని కలిశారు. అయితే రాష్ట్ర వ్యవహారాలపై కాకుండా హర్యానా ఎన్నికల బాధ్యతలను అప్పగించేందుకు మాత్రమే అపాయింట్‌మెంట్ ఇచ్చినట్టు సమాచారం. వాస్తవానికి దేశంలో కాంగ్రెస్ పార్టీ 3 రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్నది. అవే.. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్. ఇందులో రాజకీయంగా, ఆర్థికంగా హిమాచల్ ప్రదేశ్‌ను మిగతా రెండు రాష్ట్రాలతో పోల్చలేము. ఇక కర్ణాటకలో రాజకీయంగా అంతర్గత కుమ్ములాటలు, వరుస కుంభకోణాలతో పార్టీ పతనం అవుతుండగా.. ఆర్థికంగా రాష్ట్రం కష్టాల్లో ఉండటం, పాలన అస్తవ్యస్తంగా మారడంతో అధిష్ఠానానికి నిధులు సమకూరే పరిస్థితి లేదు. ఇప్పుడు కాంగ్రెస్‌కు ఏ కోణంలో చూసినా తెలంగాణే కీలకం. అలాంటప్పుడు అధిష్ఠానం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి పరపతి పతాక స్థాయిలో ఉండాలన్నది విశ్లేషకుల మాట. కానీ ఇందుకు పూర్తి భిన్నంగా ప్రస్తుత పరిస్థితి ఉన్నదని చెప్తున్నారు.

చెల్లుబాటుకాని రేవంత్ మాట!

ఎన్నికల ముందు వరకు రేవంత్‌రెడ్డికి పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీతో మంచి సంబంధాలు ఉండేవి. ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఏది చెప్తే అదే సాగింది. సీనియర్ నేతలను కాదని ఆయన చెప్పినవారికే టికెట్లు ఇచ్చిన ఘటనలు ఎన్నో. రేవంత్ ఎక్కడ సభ పెట్టి పిలిచినా గాంధీ కుటుంబం వచ్చి ప్రచారం చేసింది. రేవంత్ సీఎం అయిన తర్వాత కూడా కొన్ని రోజుల పాటు ఈ హవా కొనసాగిందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. కానీ ఇప్పుడు పరిస్థితి తలకిందులైందని, 'ఎంత చెప్తే అంత అనే స్థాయి నుంచి.. ఎంత చెప్పినా ఉత్తదే' అన్నట్టుగా తయారైందని అంటున్నారు. కీలక అంశాలన్నీ పెండింగ్‌లో ఉండడమే ఇందుకు ఉదాహరణగా చెప్తున్నారు. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి సీఎం రేవంత్ ఇచ్చిన జాబితాపై అధిష్ఠానం అసంతృప్తితో ఉన్నట్టు చెప్తున్నారు. అందుకే ఆరు నెలలుగా వాయిదాలు వేస్తున్నట్టు తెలిసింది. జూలై మొదటివారంలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. జూలై 4న కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు కూడా మొదలు పెట్టారు. కానీ ఢిల్లీ పెద్దలు ఆమోదం తెలపకపోవడంతో చివరి క్షణంలో వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత 'ఆషాఢ మాసం' అంటూ కొత్త పాట మొదలుపెట్టారు. ఆగస్టులో పక్కా అంటూ లీకులు ఇచ్చారు. శ్రావణ మాసం ముగిసినా అధిష్ఠానం ఇంకా ముహూర్తం నిర్ణయించలేదని చెప్తున్నారు. పీసీసీ చీఫ్ పదవిపైనా ఇదే తతంగం. రేవంత్‌రెడ్డి తన అనుచరుడికి పదవి ఇప్పించాలని ప్రయత్నిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. కానీ ఢిల్లీ పెద్దలు అందుకు ససేమిరా అంటూ జిల్లాలు, సామాజిక వర్గాలు, సమీకరణలు అంటూ కాలం గడుపుతున్నదని సమాచారం. ఒక వేళ సీఎం రేవంత్‌రెడ్డి బలంగా ఉండి ఉంటే, అధిష్ఠానం వద్ద ఆయన మాట చెల్లుబాటైతే మంత్రివర్గ విస్తరణ, పీసీసీ ఎంపిక ఎప్పుడో పూర్తయ్యేవన్నదని రాజకీయ విశ్లేషకుల మాట. గతంలో రేవంత్ జాబితా పంపినా ఢిల్లీ పెద్దలు ఆమోదించి, పదవులు కట్టబెట్టేవారని, ఇప్పుడు 'మీరు చెప్పాల్సింది చెప్పారు.. మేం చేసేటప్పుడు చేస్తాం' అని ముఖం మీదే చెప్తున్నారని పార్టీలో చర్చ నడుస్తున్నది. తాజాగా పోచారం శ్రీనివాస్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారుగా, గుత్తా అమిత్ రెడ్డిని డెయిరీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినా, అధిష్ఠానం పచ్చజెండా ఊపకపోవడంతో వారి ప్రమాణ స్వీకారానికి బ్రేకులు పడ్డాయన్న చర్చ జరుగుతున్నది.

రాజీవ్ విగ్రహం.. బూమరాంగ్

సీఎం రేవంత్‌రెడ్డి కొన్నాళ్లుగా అధిష్ఠానాన్ని మచ్చిక చేసుకోవడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయన 8 నెలల్లో 20 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారు. మరే ఇతర సీఎం కూడా ఇంత తక్కువ సమయంలో ఇన్ని సార్లు ఢిల్లీకి వెళ్లిన సందర్భాలు లేవని విశ్లేషకులు చెప్తున్నారు. ఢిల్లీ పెద్దలతో చెడిన తర్వాత రాకపోకలు ఎక్కువయ్యాయని చర్చ జరుగుతున్నది. అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు నానాతంటాలు పడుతున్నట్టు చెప్తున్నారు. అందుకే, సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు అంశాన్ని హఠాత్తుగా తెరమీదికి తీసుకొచ్చారని అంటున్నారు. విగ్రహావిష్కరణకు సోనియా, రాహుల్, ప్రియాంకను పిలిచి మచ్చిక చేసుకుందామని భావించినట్టు సమాచారం. అయితే తెలంగాణ తల్లి విగ్రహం కోసంకేటాయించిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుపై వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ భిన్న స్వరాలు వినిపించాయని చెప్తున్నారు. దీంతో రేవంత్ ప్లాన్ బూమరాంగ్ అయింది. ఈ నేపథ్యంలో అధిష్ఠానాన్ని తిరిగి ఎలా ప్రసన్నం చేసుకోవాలో తెలియక రేవంత్‌రెడ్డి సతమతం అవుతున్నట్టు చర్చ జరుగుతున్నది.

రమ్మంటే వస్తలేరు.. వెళ్లినా కలుస్తలేరు

ఒకప్పుడు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీకి సీఎం రేవంత్‌రెడ్డి అత్యంత సన్నిహితంగా ఉండేవారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. అందుకే ఎన్నికల సమయంలో ఎప్పుడు, ఎక్కడికి వచ్చి ప్రచారం చేయమన్నా వచ్చారని, ముఖ్యంగా రాహుల్‌గాంధీ బలపం కట్టుకొని తెలంగాణలో తిరిగారని అంటున్నారు. అయితే సీఎంగా అధికార పగ్గాలు అందుకున్న తర్వాత రేవంత్ వ్యవహార శైలిపై పార్టీలోనే అంతర్గతంగా తీవ్ర విమర్శలు, ఫిర్యాదులు వస్తుండడంతో 'గాంధీ' కుటుంబం క్రమంగా దూరం పెట్టినట్టు చర్చ జరుగుతున్నది. రేవంత్‌రెడ్డి ఎప్పుడు ఢిల్లీకి వెళ్లినా క్షణాల్లో రాహుల్‌గాంధీతో పాటు ఇతర పెద్దల అపాయింట్‌మెంట్ లభించేదని, కానీ ఇప్పుడు ఢిల్లీకి వెళ్లి గంటలు, రోజుల తరబడి పడిగాపులు కాసినా అపాయింట్‌మెంట్ దొరకడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల ప్రియాంక గాంధీని కలిసేందుకు అపాయింట్‌మెంట్ దొరుకలేదని.. చివరికి అదే కుటుంబానికి చెందిన ఓ వ్యక్తి సాయంతో కలువగలిగారని చెప్పుకుంటున్నారు. తిరిగి వచ్చే సమయంలో 'నాకు ఒక సాయం కావాలి' అంటూ ఆ నేత కోరగా, తెలంగాణకు వస్తే తప్పకుండా చేస్తానని చెప్పడంతో ఆయన రాష్ట్రానికి వచ్చి వెళ్లినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు రుణమాఫీ సభకు రావడంపైనా రాహుల్ గాంధీ ససేమిరా అంటున్నట్లుగా తెలిసింది. అరకొర రుణమాఫీ చేయడం, రైతుల్లో వ్యతిరేకతపై రాహుల్ గాంధీకి రాష్ట్ర పార్టీకి చెందిన నేతలే నివేదిక అందించినట్టు చెప్పుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి మూడు సార్లు కలిసి విజ్ఞప్తి చేసినా రాహుల్ మొహం చాటేసినట్టు తెలిసింది. రుణమాఫీ పూర్తి కాలేదని, రైతులు వ్యతిరేకంగా ఉన్న సమయంలో తానెలా వస్తానని అన్నట్టు సమాచారం. అందుకే మాఫీ సభ ఇప్పటివరకు నిర్వహించలేకపోయారు. ఆగస్టు 20న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సచివాలయం ముందు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించాలని రేవంత్‌రెడ్డి భావించారు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకగాంధీని పిలుస్తున్నట్టు చెప్పారు. అయితే వారు స్పందించలేదని, దీంతో విగ్రహావిష్కరణను వాయిదా వేసినట్టు సమాచారం.

చక్రం తిప్పుతున్న ఖర్గే..

రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గుర్రుగా ఉన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. రేవంత్ దూకుడు, టికెట్ల విషయంలో సీనియర్లను అగౌరవపరచడం వంటివి ఖర్గేకు నచ్చలేదని చెప్పుకుంటున్నారు. రాహుల్‌కు దగ్గర కావడంతో ఖర్గే సూచించిన కొన్ని పనులు, కార్యక్రమాలను కూడా రేవంత్ పక్కన పెట్టారని చర్చ జరుగుతున్నది. అప్పట్లో రేవంత్ బలంగా ఉండటంతో ఖర్గే ఓపికపట్టారని.. ఇప్పుడు చక్రం తిప్పుతున్నారని అంటున్నారు.

వాస్తవానికి రేవంత్ కాంగ్రెస్‌లో చేరడం, ఎదగడం, అధిష్ఠానం దగ్గర పరపతి పెరగడంలో కేసీ వేణుగోపాల్‌ది కీలకపాత్ర అన్నది కాంగ్రెస్ వర్గాల మాట. ఢిల్లీలో ఉండి చక్రం తిప్పుతున్న కేసీ వేణుగోపాల్‌ను కేరళ పీసీసీ అధ్యక్షుడిగా పంపి, రేవంత్ దూకుడుకు అడ్డుకట్ట వేస్తున్నట్టు చెప్తున్నారు. ఇప్పుడు రేవంత్‌కి గాంధీల అపాయింట్‌మెంట్ దొరకడం కష్టంగా మారిందని చెప్పుకుంటున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో వెనుక ఉండి నడిపించిన ఓ వ్యక్తి, ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన ఓ నేత తప్ప ఇప్పుడు రేవంత్ రెడ్డికి ఢిల్లీలో పెద్దగా పరపతి లేదని సమాచారం.

అన్నదమ్ముళ్ల వ్యవహారశైలి

సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రేవంత్‌రెడ్డి సీనియర్లను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయాల్లోనూ మొండివైఖరి ప్రదర్శిస్తుండడంపై అధిష్ఠానానికి వరుసగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయట. మరోవైపు రేవంత్ సోదరుల వ్యవహారంపైనా అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం. అధికారంలోకి వచ్చిన మొదట్లోనే రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి కాన్వాయ్‌లో ప్రయాణించడం మొదలు, ఇటీవల అమెరికా పర్యటనలో సీఎం తమ్ముడికి చెందిన స్వచ్ఛ్ బయో గ్రీన్ సంస్థతో ఒప్పందం చేసుకోవడం వరకు అన్ని అంశాలు అధిష్ఠానానికి ఎప్పటికప్పుడు వెళ్తున్నాయని చెప్పుకుంటున్నారు.

కోరి తెచ్చుకున్న కష్టాలు

సీఎం రేవంత్ ప్రస్తుత పరిస్థితికి పూర్తిగా ఆయనదే బాధ్యత అని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. పార్టీ గురించి కాకుండా, తన సొంత ఇమేజీ కోసం నిర్ణయాలు తీసుకోవడం, అతిగా ప్రచారం చేసుకోవడం, ప్రభుత్వంలో ఒంటెత్తు పోకడలతో అధిష్ఠానం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు చెప్తున్నారు. రేవంత్‌రెడ్డి వ్యవహారశైలి ఆయన పాలిట భస్మాసుర హస్తంగా మారుతున్నదని అంటున్నారు.

పార్లమెంట్ సీట్లు రాకపోవడం

అసెంబ్లీ ఎన్నికల్లో పక్కాగా గెలుస్తామని రేవంత్ రెడ్డి పదేపదే చెప్పారని, అన్నట్టుగానే అధికారంలోకి వచ్చారని గుర్తు చేస్తున్నారు. దీంతో అధిష్ఠానం ఆయనను గుడ్డిగా నమ్మిందని, లోక్‌సభ ఎన్నికల్లో ఆయన సీనియర్లను పక్కనబెట్టి ఎవరికి టికెట్ ఇవ్వమంటే వారికి ఇచ్చారని చెప్తున్నారు. 12 సీట్లు, 14 సీట్లు అంటూ ఊదరగొట్టారని.. చివరికి 8 సీట్లకే పరిమితం కావడంతో ఢిల్లీ పెద్దలు షాక్ అయినట్టు సమాచారం. సీఎం సొంత నియోజకవర్గం, ఎంపీ సిట్టింగ్ స్థానాల్లో ఓడిపోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. విచారణ కమిటీని కూడా వేసిందని గుర్తు చేస్తున్నారు. 'రేవంత్‌కు రాష్ట్రంలో అంత సీన్ లేదు' అనే భావన ఏర్పడిందని అంటున్నారు.

పార్టీ ఫండ్‌పై భారీ ఆశలు

తెలంగాణతోపాటు కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లో మాత్రమే కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. రాబోయే ఎన్నికల్లో ఖర్చు పెట్టేందుకు పార్టీకి నిధులు సమకూర్చగలిగేవి కర్ణాటక, తెలంగాణ మాత్రమే. కర్ణాటక ఆర్థిక పరిస్థితిని చూస్తే అక్కడ పెద్దగా వసూలయ్యే పరిస్థితి లేదు. ఆ రాష్ట్ర సీఎం కుంభకోణంలో ఇరుక్కోవడం, సీఎం కుర్చీ కోసం కొట్లాడుకోవడం తలనొప్పిగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఢిల్లీ పెద్దలకు తెలంగాణ కామధేనువుగా కనిపిస్తున్నదని గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే తెలంగాణకు భారీ స్థాయిలో నిధుల సమీకరణ టార్గెట్ పెట్టారని, కానీ ఆ స్థాయిలో సాధ్యం కాదని చేతులెత్తేస్తుండడంతో ఢిల్లీ పెద్దలు గుర్రుగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

రుణమాఫీపై రైతుల ఆందోళన

హనుమకొండ, మహబూబాబాద్‌లో ధర్నాలు

వరంగల్/నర్సింహులపేట, ఆగస్టు 31 : ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు కూలీ సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో సీపీఎం జిల్లా నాయకుడె గునిగంటి మోహన్, కేవీపీఎస్ జిల్లా నాయకుడు మందుల యాకూబ్ తదితరులు పాల్గొన్నారు. రైతులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి, కొత్త రుణాలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.